సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

గురువారం । 10 । జూలై । 2025



ఉపాధ్యాయుడి బలవన్మరణం

ఓ వైపు ఆర్థిక ఇబ్బందులు, మరోవైపు పిల్లల చదువులు ముందుకు సాగలేని పరిస్థితులు నెలకొనడంతో ఓ ఉపాధ్యాయుడు బలవన్మరణానికి పాల్పడ్డాడు. 4లో



ఇన్‌చార్జ్‌ల పాలనకే మొగ్గు

జిల్లాలో కీలకమైన రెవెన్యూ శాఖలో ఇన్‌చార్జ్‌ల పాలన సాగుతోంది. రెగ్యులర్ అధికారులు లేక ప్రజలకు సేవల్లో జాప్యం జరుగుతోంది. 4లో

గరిష్టం/కనిష్టం
33.9°/22.6°

జిల్లా పరిధిలో బుధవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. గాలివేగం పెరిగింది. ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా తుంపర్లు పడ్డాయి. నైరుతి దిశగా గంటకు 8 నుంచి 16 కిలో మీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

నేడు సీఎం చంద్రబాబు రాక

పుట్టపర్తిటౌన్: మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్‌లో పాల్గొనేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గురువారం కొత్తచెరువుకు వస్తున్నారు. ఉదయం 8.10 గంటలకు విజయవాడ విమానాశ్రయం నుంచి బయల్దేరి 9.10 గంటలకు పుట్టపర్తి విమానాశ్రయం చేరుకుంటారు. అక్కడి నుంచి ప్రత్యేక కాన్వాయ్ ద్వారా బయల్దేరి 9.25 గంటలకు కొత్తచెరువు సత్యసాయి జూనియర్ కళాశాలకు చేరుకుంటారు. 9.30 నుంచి 9.50 గంటల వరకు విద్యార్థుల తల్లిదండ్రులతో ముఖాముఖి అవుతారు. అనంతరం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు మెగా పేరెంట్స్ టీచర్స్ సమావేశంలో పాల్గొంటారు. కార్యక్రమం పూర్తయ్యాక అక్కడి నుంచి పుట్టపర్తి ప్రశాంతి నిలయం చేరుకుంటారు. సత్యసాయి మహాసమాధిని దర్శించుకుంటారు. అక్కడి నుంచి 2.35 గంటలకు సత్యసాయి విమానాశ్రయం చేరుకుని ప్రత్యేక విమానం ద్వారా విజయవాడకు బయల్దేరి వెళ్లనున్నారు.

పర్యటనను విజయవంతం చేయండి

ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ పర్యటనలను అధికారులు సమన్వయంతో విజయవంతం చేయాలని కలెక్టర్ చేతన్ కోరారు. కొత్తచెరువు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరుగుతున్న సీఎం పర్యటన ఏర్పాట్లను బుధవారం ఆయన పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ సీఎం, విద్యాశాఖ మంత్రి కొత్తచెరువు జూనియర్ కళాశాల ఆవరణలో నిర్వహించే మెగా పేరెంట్స్ మీట్‌లో పాల్గొననున్నారన్నారు.

వీరభద్రుని సేవలో తెలంగాణ ఆర్టీసీ ఎండీ



ఎండీ సజ్జనార్‌కు రశీదు అందజేస్తున్న ఈఓ, చైర్మన్

లేపాక్షి: తెలంగాణ ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ సజ్జనార్ దంపతులు బుధవారం ఉదయం లేపాక్షి వీరభద్రస్వామిని దర్శించుకున్నారు. తొలుత ఆయనకు అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం దుర్గాదేవి, వీరభద్రస్వాముల వారికి ప్రత్యేకంగా పూజలు చేశారు. సజ్జనార్ దంపతులు అభిషేక సేవలో పాల్గొని మొక్కులో భాగంగా స్వామి వారికి బంగారు మీసాలు, బంగారు విభూతి బొట్టు (26.030 మిల్లి గ్రాములు), దుర్గాదేవి అమ్మవారికి మాంగల్యం (22.790 మిల్లీ గ్రాములు), ముక్కుపుడక సమర్పించారు. వీటిని దేవాలయ కార్యనిర్వహణాధికారి నరసింహమూర్తి, ఆలయ కమిటీ చైర్మన్ కరణం రమానందన్‌కు అందజేశారు.

నేడు గురుపౌర్ణమి వేడుకలు

ప్రశాంతి నిలయం: పుట్టపర్తి ప్రశాంతి నిలయంలో గురువారం గురుపౌర్ణమి వేడుకలు నిర్వహించనున్నారు. ఉదయం 8 గంటలకు విద్యార్థుల వేదపఠనంతో వేడుకలు ప్రారంభమవుతాయి. సాయికుల్వంత్ సభా మందిరంలో సత్యసాయి మహాసమాధి చెంత సత్యసాయి విద్యార్థుల గురువందనం కార్యక్రమం, అనంతరం సత్యసాయి గ్లోబల్ కౌన్సిల్ వైస్ చైర్మన్ నిమీపాండే ప్రారంభోపన్యాసం చేస్తారు. స్థానిక రైతులకు వ్యవసాయ పనిముట్లను పంపిణీ చేస్తారు. కేంద్ర వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి, రైతు సంక్షేమ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగిస్తారు. అనంతరం సత్యసాయి పూర్వపు ప్రసంగాలను డిజిటల్ స్క్రీన్‌లపై ప్రదర్శిస్తారు. సాయంత్రం ప్రముఖ సంగీత విద్వాంసుడు హరిహరణ్ సంగీత కచేరీ నిర్వహిస్తారు.

ఇంటిగ్రేటెడ్ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

- జేఎన్‌టీయూ వీసీ సుదర్శనరావు

అనంతపురం: జేఎన్‌టీయూ (ఏ)లో ఇంటిగ్రేటెడ్ కోర్సులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు వీసీ ప్రొఫెసర్ హెచ్. సుదర్శనరావు తెలిపారు. బీటెక్ కోర్సు మూడు సంవత్సరాలు జేఎన్‌టీయూ అనంతపురంలో, ఫైనలియర్ స్వీడన్‌లోని బ్లెకింగ్ వర్సిటీపూర్తి చేయవచ్చన్నారు. బీటెక్ డిగ్రీని జేఎన్‌టీయూ, బీఎస్ పట్టాను బ్లెకింగ్ వర్సిటీ (స్వీడన్) ప్రదానం చేస్తుందన్నారు. అనంతరం ఎంఎస్ చేయాలనుకుంటే బ్లెకింగ్ వర్సిటీలోనే పూర్తి చేయవచ్చన్నారు. జేఈఈ, ఏపీ ఈఏపీసెట్, తెలంగాణ ఈఏపీసెట్ అర్హత సాధించి ఉండాలని, విదేశాల్లో ఉద్యోగం సంపాదించడానికి ఈ కోర్సు మంచి అవకాశమని వీసీ పేర్కొన్నారు. బీటెక్ (కంప్యూటర్ సైన్సెస్), బీటెక్ (ఈసీఈ)లో సీట్లు కేటాయిస్తారని పేర్కొన్నారు. ఇంటర్‌లో 60 శాతం మార్కులు ఉండి, జేఈఈ మెయిన్స్ ర్యాంకు, ఏపీ ఈఏపీసెట్ ర్యాంకు, ఇతర స్టేట్ ర్యాంకుల అభ్యర్థులకు ప్రాధాన్యత ఉంటుందన్నారు. స్పాట్ అడ్మిషన్స్ 17వ తేదీ వరకు పొడిగించినట్లు వెల్లడించారు. ఫీజు, ఇతర వివరాలకు 8008802558, 998994453, 9441889732 నంబర్లకు సంప్రదించవచ్చు.





ఇక్కడ కనిపిస్తున్న ముగ్గురు (మదీహ, జుల్ఫికర్, మహమ్మద్ ఓవైజ్) చిన్నారులు రొద్దం మండల కేంద్రానికి చెందిన వారు. గత ప్రభుత్వంలో క్రమం తప్పకుండా ఏటా అమ్మ ఒడి పథకం ద్వారా లబ్ధి పొందారు. ఈసారి ఒక్కొక్కరికి రూ.15వేలు చొప్పున అందరికీ కలిపి రూ.45 వేలు వస్తుందని ఆశించారు. అయితే ట్యాక్స్ పేయర్లుగా ఉన్నారనే కారణంతో 'తల్లికి వందనం' డబ్బులు జమ చేయలేదు. కూలి పనులు చేసుకునే తాము పన్ను చెల్లింపుదారులు ఎలా అవుతామని విద్యార్థుల తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు.

తల్లికి వందనం..
వంచనకే అందలం



- ఎన్నికల సమయంలో ఇచ్చిన మాట తప్పిన చంద్రబాబు
- అందరికీ ఇస్తామని కొందరికే తల్లికి వందనం పరిమితం
- జిల్లాలో సగం మందికి పైగా విద్యార్థులకు మొండిచెయ్యి
- గతంలో ఉన్న అర్హత.. ఇప్పుడెందుకు లేదంటూ సూటిప్రశ్న



ఈమె పేరు సాకే సావిత్రి. బత్తలపల్లిలో నివాసం ఉంటున్నారు. గత ప్రభుత్వంలో ఏటా అమ్మ ఒడి కింద లబ్ధి పొందారు. కూటమి ప్రభుత్వంలో పది ఎకరాల పైన భూమి ఉందనే కారణం చూపి 'తల్లికి వందనం' పథకానికి అనర్హులుగా చూపించారు. అధికారుల వద్దకు వెళ్లి.. పది కాదు.. కనీసం ఐదు ఎకరాల పొలం ఇచ్చినా.. తమకు 'తల్లికి వందనం' వద్దని చెప్పారు. కూరగాయలు అమ్ముకుని జీవనం సాగించే తమకు 6, 8 తరగతులు చదివే పిల్లలు ఉన్నారని.. రెండు ఎకరాల పొలం మాత్రమే ఉందని వారు తెలిపారు.

సాక్షి, పుట్టపర్తి: 'నీకు రూ.15 వేలు.. నీకు రూ.15 వేలు.. నీకు రూ.15 వేలు.. ఇంట్లో పాఠశాలకు వెళ్లే చిన్నారులు ఎందరు ఉన్నా.. ఒక్కొక్కరికి రూ.15 చొప్పున అందరికీ 'తల్లికి వందనం' పేరుతో తల్లుల బ్యాంకు ఖాతాలో నగదు జమ చేస్తాం' అని ఎన్నికల సమయంలో చంద్రబాబు హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ పథకం సక్రమంగా అమలు కాకపోవడం విమర్శలకు తావిస్తోంది. తొలి ఏడాది పథకం ఊసే లేకుండా గడిచిపోయింది. తర్వాతి ఏడాది కూడా అరకొరగానే పథకం అమలు చేశారు. సగం మందికి పైగా విద్యార్థులకు మొండిచెయ్యి చూపించారు. గతంలో ఇచ్చిన మాట ప్రకారం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ హయాంలో 2019 నుంచి 2023 వరకు నాలుగేళ్ల పాటు ఏటా పాఠశాలలు పునఃప్రారంభమైన వెంటనే తల్లుల బ్యాంకు ఖాతాల్లోకి 'అమ్మ ఒడి' డబ్బులు జమ చేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత 'తల్లికి వందనం' పథకం సరిగా అమలుకు నోచుకోకపోవడం గమనార్హం. కానీ గత ప్రభుత్వం మాదిరి ఒకరికి కాకుండా.. ఇంట్లో ఉన్న చిన్నారులందరికీ ఇచ్చామని పాలకులు గొప్పలు చెబుతున్నారు.

గత ప్రభుత్వంలో అమ్మ ఒడి ద్వారా జిల్లాకు చేకూరిన లబ్ధి

విద్యా సంవత్సరం	తల్లులు	లబ్ధి రూ.(కోట్లలో)
2019 - 20	1,62,574	రూ.243.86
2020 - 21	1,61,554	రూ.242.33
2021 - 22	1,66,398	రూ.249.60
2022 - 23	1,62,080	రూ.210.10
మొత్తం నాలుగు విడతల్లో 1,66,398 మందికి రూ.946.49 కోట్లు జమ చేశారు.		

ప్రైవేటు సంస్థల్లో ఫీజుల మోత

తల్లికి వందనం పథకం అందరికీ ఇస్తారని ప్రైవేటు సంస్థల్లో ఫీజులు మోత మోగిస్తున్నారు. ఈ పథకం ద్వారా లబ్ధి పొందిన వారు ఫీజులు కడుతున్నారు. అయితే చాలామందికి పథకం డబ్బులు అందలేదు. ఫలితంగా అలాంటి వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో సరైన నిర్వహణ లేకపోవడంతో అక్కడికి విద్యార్థులను పంపించలేని పరిస్థితి. దీంతో పిల్లల భవిష్యత్తుపై అయోమయం నెలకొందని చాలామంది తల్లిదండ్రులు పునరాలోచనలో పడ్డారు. ప్రభుత్వం నుంచి అందే తల్లికి వందనం కింద ఎంతో కొంత నగదు వస్తే.. పంపిద్దామనుకున్న తల్లిదండ్రులకు చంద్రబాబునాయుడు వెన్నుపోటు పొడుస్తున్నారు.

జిల్లాలో విద్యా సమాచారం

ప్రభుత్వ పాఠశాలలు	2,078
విద్యార్థుల సంఖ్య	1,47,000
ప్రైవేట్ పాఠశాలలు	430
ప్రైవేట్ విద్యార్థుల సంఖ్య	80,000
జూనియర్ కళాశాలలు	113
విద్యార్థుల సంఖ్య	10,000

సచివాలయం చుట్టూ ప్రదక్షిణ



గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో క్రమం తప్పకుండా అమ్మ ఒడి పథకం డబ్బులు నా బ్యాంకు ఖాతాలో జమ చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత తొలి ఏడాది పథకం ప్రస్తావన లేదు. ఈసారి అమలు చేసినా.. నాకు డబ్బులు జమ కాలేదు. బ్యాంకుకెళ్లి పరిశీలించగా నగదు జమ కాలేదని చెప్పారు. సచివాలయం చుట్టూ తిరుగుతున్నా. పట్టించుకునే నాథుడే లేరు. ఒక అమ్మాయి పదో తరగతి, ఇంకో అమ్మాయి ఇంటర్ చదువుతోంది. డబ్బులు వస్తే ఫీజులు కడదామని ఆశతో ఎదురు చూస్తున్నా.

– జి.రమాదేవి, ఉప్పార్లపల్లి, నల్లచెరువు మండలం

ముగ్గురుంటే ఒక్కరికే ఇచ్చారు



మా ఇంట్లో ముగ్గురు పిల్లలు ఉన్నారు. పెద్ద కుమార్తె పదో తరగతి చదువుతోంది. జాబితాలో ఆమె పేరు ఉండటంతో తల్లికి వందనం డబ్బులు ఇచ్చారు. అయితే నాల్గో తరగతి చదువుతోన్న కుమారుడు, మూడో తరగతి చదువుతోన్న మరో కుమార్తె పేర్లు జాబితాలో లేవని చెప్పారు. అందరికీ ఇస్తామని ఇచ్చిన మాటను చంద్రబాబు నిలబెట్టుకోవాలి.

– అశ్వర్థనారాయణ, ఎం.రంగాపురం, మడకశిర మండలం

మరీ ఇంత అన్యాయమా?



గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఏటా అమ్మ ఒడి డబ్బులు తీసుకున్నాం. కూటమి ప్రభుత్వంలో ఒక్క రూపాయి కూడా అందలేదు. ఇంట్లో ఎంతమంది విద్యార్థులున్నా ప్రతి ఒక్కరికీ రూ.15 వేలు చొప్పున ఇస్తామని చెప్పారు. మా ఇంట్లో ముగ్గురు పిల్లలు ఉన్నారు. ఒక్కరికి కూడా తల్లికి వందనం పథకం వర్తింపజేయలేదు. అధికారుల చుట్టూ తిరుగుతూనే ఉన్నా.. ఎవ్వరూ పట్టించుకోవడం లేదు.

– భాగ్యమ్మ, టీడీ పల్లి, రొళ్ల మండలం

ప్రజల్లోకి చంద్రబాబు మోసాలు



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న హిందూపురం పార్లమెంట్ పరిశీలకుడు రమేష్‌రెడ్డి, మడకశిర నియోజకవర్గ సమన్వయకర్త ఈరలక్కప్ప తదితరులు

- వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ పరిశీలకుడు రమేష్‌రెడ్డి

గుడిబండ: సూపర్ సిక్స్ తదితర హామీలతో గద్దెనెక్కి అమలు చేయకుండా చంద్రబాబు చేసిన మోసాలను ప్రజల్లోకి తీసుకెళ్తామని హిందూపురం పార్లమెంట్ పరిశీలకుడు రమేష్ రెడ్డి తెలిపారు. బుధవారం మండల కేంద్రం గుడిబండలోని వైఎస్సార్ విగ్రహం వద్ద 'రీకాలింగ్ చంద్రబాబూస్ మేనిఫెస్టో.. 'బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ' పోస్టర్లను మడకశిర సమన్వయకర్త ఈరలక్కప్పతో కలిసి ఆయన ఆవిష్కరించారు. అనంతరం రమేశ్‌రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల హామీలను నెరవేర్చకుండా కూటమి ప్రభుత్వం ప్రజలను నిలువునా మోసం చేసిందన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులను టార్గెట్‌గా చేసుకుని అక్రమ కేసులు పెడుతూ రెడ్ బుక్ రాజ్యాంగం అమలు చేస్తూ రాష్ట్రంలో అలజడులు సృష్టిస్తోందన్నారు. కార్యక్రమంలో మాజీ మంత్రి నర్సేగౌడు, జెడ్పీటీసీ సభ్యుడు భూతరాజు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ డీఎల్ యంజారేగౌడు, జిల్లా ప్రధాన కార్యదర్శి శివకుమార్, సర్పంచ్ కరుణాకర్‌గౌడు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ హామీలపై సమాధానమివ్వాలి

- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్ డిమాండ్



'చంద్రబాబు ష్యూరిటీ..మోసం గ్యారెంటీ' క్యూఆర్ కోడ్ ఫ్లెక్సీని ఆవిష్కరిస్తున్న ఉషశ్రీచరణ్

పరిగి: ఎన్నికల సమయంలో సూపర్ సిక్స్ సహా ఇచ్చిన హామీలు ఏమయ్యాయో కూటమి ప్రభుత్వాన్ని ప్రజలకు సమాధానం చెప్పాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్ డిమాండ్ చేశారు. హామీలు గాలికొదిలేసి డైవర్షన్ పాలిటిక్స్‌తో నెట్టుకొస్తున్న ప్రభుత్వంపై మండిపడ్డారు. బుధవారం ఊటుకూరులో వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో నిర్వహించిన 'రీకాలింగ్ చంద్రబాబూస్ మేనిఫెస్టో' కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఏడాది పాలనలో ప్రజలను వంచించడానికే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రాధాన్యతనిస్తున్నారన్నారు. అరకొరగా అమలు చేసిన తల్లికి వందనం, ఉచిత గ్యాస్ సిలిండర్ పథకాలనే చాలా గొప్పగా చేశామని ప్రచారం చేసుకుంటున్నారని ధ్వజమెత్తారు. అర్హత ఉన్నప్పటికీ సగం మందికి పథకాలు వర్తింపజేయలేదన్నారు. ఇంటింటా తిరిగి ప్రభుత్వం చేసిన అన్యాయాలను, అబద్ధపు హామీలతో చేసిన వంచన గురించి వివరిస్తామన్నారు.

రైతులకు ఒక్క మేలైనా జరిగిందా?

రెండు ఖరీఫ్ సీజన్‌లు గడిచినా ఒక్కసారి కూడా అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రైతులకు పెట్టుబడి సాయం అందించలేదని ఉషశ్రీచరణ్ విమర్శించారు. వైఎస్సార్‌సీపీ హయాంలో సంక్షేమ క్యాలెండర్ ప్రకారం రైతు భరోసా, విత్తనాలు, ఎరువుల అందుబాటు, గిట్టుబాటు ధర, నష్ట పరిహారం అందించారని గుర్తు చేశారు. అలాంటి ముఖ్యమంత్రిని విమర్శించడానికే ప్రస్తుత సీఎం సహా సహా మంత్రులు, కూటమి ఎమ్మెల్యేలు సమయాన్ని కేటాయిస్తున్నారు తప్పితే ప్రజల గురించి ఆలోచించడం లేదన్నారు.

అభద్రతాభావంతోనే అవాకులు చెవాకులు..

అధికారంలోకి వస్తే 50 ఏళ్లకే బీసీలకు పింఛన్ ఇస్తామన్న వాగ్దానాన్ని ఎప్పుడు అమలు చేస్తారో బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత ప్రకటించాలని ఉషశ్రీచరణ్ డిమాండ్ చేశారు. మంత్రి పదవి ఎక్కడ పోతుందోనన్న అభద్రతాభావంతోనే వైఎస్సార్‌సీపీపైన, అధినేత వైఎస్ జగన్‌పై అవాకులు చెవాకులు పేలుతుంటారని మండిపడ్డారు. పెనుకొండ నియోజకవర్గంలో రూ. రూ.850 కోట్లతో అభివృద్ధి చేశామని ప్రకటించడం మంత్రి అరకొర జ్ఞానానికి నిదర్శనమని ఎద్దేవా చేశారు. ధైర్యముంటే పెనుకొండ నియోజకవర్గ అభివృద్ధిపై చర్చించడానికి ముందుకు రావాలని సవితకు సవాల్ విసిరారు.

ప్రభుత్వానికి చెంపపెట్టు..

గిట్టుబాటు ధరలేక ఇబ్బంది పడుతున్న రైతులకు అండగా నిలుస్తూ చిత్తూరు జిల్లా బంగారుపాళ్యంలో పర్యటించిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని నిలువరించేందుకు ఎన్నికుట్రలు పన్నినా అశేష జనవాహిని తరలి రావడం కూటమి ప్రభుత్వానికి చెంపపెట్టేనని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్ పేర్కొన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి గిట్టుబాటు ధర కల్పించి రైతులను ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నరసింహమూర్తి, సర్పంచ్ దిలీప్ యాదవ్, ఎంపీటీసీ అమరావతి తదితరులు పాల్గొన్నారు.

ఖరీఫ్‌కు గడ్డుకాలం

- పదునైన వర్షం కోసం ఎదురుచూపు
- ఈ నెల 15 వరకే అదను
- ఇప్పటి వరకు 6.97 శాతం విస్తీర్ణంలోనే వేరుశనగ సాగు



పెడపల్లి వద్ద పంట వేయని పొలం

పుట్టపర్తి అర్బన్: జిల్లాలో వ్యవసాయం తిరోగమనంలో పయనిస్తోంది. సకాలంలో సాగు చేయకపోతే ఆశించిన దిగుబడులు రాక తీవ్ర నష్టాలను చవిచూడాల్సి వస్తుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. లక్షలాది మంది రైతులు ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసే వేరుశనగ, కంది పంటలపైనే ఆధారపడి జీవిస్తారు. అటువంటి పంటలకు ఈ ఏడాది గడ్డుకాలం దాపురించింది. లోటు వర్షపాతంతో ఇప్పటి వరకూ సరైన పదును వర్షం కురవక, కొనుగోలు చేసిన విత్తనాలు పొలంలో వేయకపోవడంతో ఊజీలు వస్తాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

- జిల్లాలో 2,19,950 హెక్టార్ల సాగు భూమి ఉంది. ఇందులో అత్యధికంగా 1,51,824 హెక్టార్లలో వేరుశనగ సాగు చేస్తారు. అయితే ఖరీఫ్–2025లో ఇప్పటి వరకూ 10,365 హెక్టార్లలో అంటే 6.97 శాతం విస్తీర్ణంలో మాత్రమే పంట వేశారు. ఇక కంది సాధారణ సాగు 28,925 హెక్టార్లు కాగా.. ప్రస్తుతం 1,614 హెక్టార్లలో మాత్రమే సాగైంది. సీజన్ ఆరంభంలో కొంత మేర వర్షాలు కురిసినా పొలాలు దుక్కి చేయడానికి సరిపోలేదు. వేరుశనగ సాగు చేయడానికి జూన్ 15 నుంచి జూలై 15 వరకూ మంచి అదను.

వరుణుడు కరుణిస్తేనే..

రైతులు వర్షం కోసం ఎదురుచూస్తున్నారు. ఖరీఫ్ సాగు కోసం అష్టకష్టాలు పడి విత్తనం సమకూర్చుకున్నారు. జూన్‌లో 66 మి.మీ వర్షపాతానికి గాను 34 మి.మీ. వర్షపాతం నమోదైంది. ఇక జూలై మాసంలో ఇప్పటి వరకూ చినుకు నేలపడలేదు. ఈ మాసంలో సాధారణంగా 72 మి.మీ. కురవాల్సి ఉంది. మరో 9 రోజుల్లో అదను దాటిపోతుంది. అప్పులు చేసి విత్తన కాయలు కొనుగోలు చేశామని, వరుణ దేవుడు కరుణిస్తేనే కుటుంబాలను పోషించుకోగలమని లేదంటే ఆత్మహత్యలే శరణ్యమని రైతులు అంటున్నారు. ఈ ఏడాది కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అన్నదాత సుఖీభవ కింద రూ.7 వేలను జూన్ మాసంలోనే ఖాతాల్లో జమ చేస్తామని హామీ ఇచ్చినా ఇప్పటి వరకూ వేయక పోవడంతో రైతులు మరింత కష్టాలు పడుతున్నారు.

వేరుశనగపై తీవ్ర ప్రభావం..



ఖరీఫ్ సీజన్‌లో తీవ్ర వర్షాభావ పరిస్థితులు వేరుశనగపై తీవ్ర ప్రభావం చూపుతాయి. ఆలస్యంగా వేరుశనగ సాగు చేస్తే దిగుబడి రాక తీవ్ర నష్టాలు వస్తాయి. బోరుబావులు ఉన్న రైతులు మాత్రం సాగు చేశారు. మెట్ట పంటకు వాతావరణం అనుకూలించదు. దీంతో పాటు కొనుగోలు చేసిన విత్తనకాయలు ఊజీ వచ్చి తీవ్ర నష్టం వస్తుంది. ఇప్పటి వరకూ ప్రభుత్వం ఎటువంటి సహాయమూ చేయలేదు. పంట పెట్టుబడులకు చాలా ఇబ్బందికరంగా ఉంది.

– నరసారెడ్డి, రైతు, వెంగళమ్మచెరువు

వలసలు తప్పేలా లేవు



సాగుకు అవసరమైన సమయంలో వర్షాలు కురవడం లేదు. అదను దాటిపోతున్నా పదునైన వర్షం పడటం లేదు. ఇదిలాగే కొనసాగితే ఈ సీజన్‌లో పంటలకు విరామం ప్రకటించాల్సి వస్తోంది. ఆలస్యపు వర్షాలకు పంటలు సాగు చేసినా గిట్టుబాటు ధరలు రావు. మా గ్రామంలో ఇప్పటి వరకూ వంద ఎకరాల్లో కూడా పంటలు సాగులోకి రాలేదు. రాబోవు కాలంలో రైతులు తట్టాబుట్ట సర్దుకొని వలసలు పోవడం ఖాయంగా కనిపిస్తోంది.

– మాబుసాహెబ్, రైతు, నిడిమామిడి

నెలాఖరు వరకు సాగు చేయొచ్చు



సాధారణంగా జూన్ 15 నుంచి జూలై 15 వరకు వేరుశనగ, కంది పంటలకు మంచి అదను. వర్షాలు ఆలస్యంగా కురిస్తే జూలై చివరి వరకూ పంటలు సాగు చేసుకోవచ్చు. విత్తనకాయలను రైతులు బాగానే కొనుగోలు చేశారు. ప్రతి విత్తనం భూమిలో పడాలి. దీంతో పాటు కంది మినీ కిట్లను రైతులకు అందజేశాం.

– సుబ్బారావు, జిల్లా వ్యవసాయాధికారి

నేడు హెచ్చెల్సీకి నీటి విడుదల



బొమ్మనహాళ్: కర్ణాటకలోని తుంగభద్ర జలాశయం నుంచి గురువారం ఎగువ కాలువ (హెచ్చెల్సీ)తో పాటు దిగువ కాలువ (ఎల్లెల్సీ)కు టీబీ బోర్డు అధికారులు నీటిని విడుదల చేయనున్నారు. దీనిపై గత నెల 27న బెంగళూరులోని విధానసౌధలో జరిగిన 124వ నీటి సలహా మండలి సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. ఖరీఫ్‌లో పంటల సాగుకు ఈ నెల 10 నుంచి నవంబర్ 30 వరకూ ఏపీ, కర్ణాటక ఇరు రాష్ట్రాల కోటా నీరు కలిపి దాదాపు 1,300 క్యూసెక్కులు వదలనున్నారు. కొత్త క్రస్టు గేట్ల ఏర్పాటు నేపథ్యంలో ఖరీఫ్‌కు మాత్రమే నీరివ్వనున్నారు.

కొనసాగుతున్న ఇన్‌ఫ్లో

బుధవారం కూడా తుంగభద్ర డ్యాం కొనసాగింది. ఈ క్రమంలో డ్యాం 16 గేట్లను రెండున్నర అడుగుల మేర ఎత్తి 45,280 క్యూసెక్కులు నదికి, మరో 7,400 క్యూసెక్కుల మేర కాలువలకు వదులుతున్నారు. మొత్తంగా ఇన్‌ఫ్లో 51,955 కూసెక్కులు, అవుట్‌ఫ్లో 52,678 క్యూసెక్కులుగా నమోదైంది. జలాశయం ఎగువ పరివాహక ప్రాంతాల్లో వర్షాలు ఆశాజనకంగా కురుస్తున్నాయి. ప్రస్తుతం డ్యాంలో 1,633 అడుగులకు గాను 1,624.80 అడుగుల వద్ద 105.788 టీఎంసీల నిల్వ సామర్థ్యానికి గాను 75.837 టీఎంసీల నీరు ఉంది.

క్లుప్తంగా

వ్యక్తిపై కత్తితో దాడి


చికిత్స పొందుతున్న నరసింహులు

హిందూపురం: మండలంలోని మలుగూరు రైల్వేస్టేషన్ సమీపంలో ఓ వ్యక్తిపై గుర్తుతెలియని వ్యక్తులు కత్తితో దాడి చేశారు. వివరాలు.. సోమందేపల్లి మండలం పోలేపల్లికి చెందిన నరసింహులు మరో వ్యక్తితో కలసి బుధవారం సాయంత్రం ద్విచక్ర వాహనంపై స్వగ్రామానికి వెళుతుండగా మలుగూరు రైల్వేస్టేషన్ సమీపంలో వెనుక నుంచి మరో ద్విచక్ర వాహనంపై వచ్చిన ముగ్గురు వ్యక్తులు అటకాయించి మలుగూరు గ్రామానికి దారి అడిగారు. చెబుతుండగానే కత్తితో దాడి చేశారు. ఆ సమయంలో కేకలు వేయడంతో దుండగులు ద్విచక్ర వాహనంపై ఉడాయించారు. అక్కడకు చేరుకున్న స్థానికులు క్షతగాత్రుడిని వెంటనే హిందూపురంలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఘటనపై హిందూపురం రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు.

రెండు ఇళ్లల్లో చోరీ

లేపాక్షి: మండలంలోని మైదుగోళం గ్రామంలో మంగళవారం రాత్రి రెండు ఇళ్లల్లో చోరీ జరిగింది. పది రోజుల క్రితం గ్రామంలో చోటు చేసుకున్న హత్య నేపథ్యంలో ఆ గ్రామానికి చెందిన శాంతమ్మ, బేబీ శ్యామల కుటుంబాలు ఈ 5న గ్రామాన్ని వీడిపోయాయి. తాళం వేసిన ఇళ్లను గుర్తించిన దుండగులు మంగళవారం రాత్రి లోపలకు చొరబడి బంగారు నగలతో పాటు, కిరాణా దుకాణంలోని నగదునూ అపహరించారు. విషయం తెలుసుకున్న బాధితులు బుధవారం సాయంత్రం ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి


మృతుడు తిప్పేస్వామి

అమరాపురం: ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై ఓ యువకుడు మృతి చెందాడు. మరొకరు గాయపడ్డారు. వివరాలు.. అమరాపురంలోని గాడి దొడ్డయ్య ఇంటి సమీపంలో ఉన్న చింత చెట్టులో ఉన్న తుట్టె నుంచి తేనెను సేకరించేందుకు బుధవారం అదే గ్రామానికి చెందిన యువకులు తిప్పేస్వామి (35), గిరీష్ సిద్ధమయ్యారు. చెట్టు ఎక్కి తేనె తుట్టె వైపుగా సాగుతుండగా చెట్టు మధ్యలో నుంచి వెళ్లిన విద్యుత్ తీగలు ప్రమాదవశాత్తు తగలి షాక్‌కు గురయ్యారు. గమనించిన స్థానికులు వెంటనే స్థానిక పీహెచ్‌సీకి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే తిప్పేస్వామి మృతి చెందినట్లు నిర్ధారించారు. గాయపడిన గిరీష్‌కు ప్రథమ చికిత్స అందించి, మెరుగైన వైద్యం కోసం మడకశిరలోని ప్రభుత్వాస్పత్రికి రెఫర్ చేశారు. కాగా, కుమారుడు మృతితో ఒంటరిగా మారిన తల్లి పుట్టమ్మ వేదనకు అంతులేకుండా పోయింది.

ఇన్‌చార్జ్‌ల పాలనకే మొగ్గు



జిల్లా యంత్రాంగంలో అత్యంత కీలకమైన రెవెన్యూ శాఖలో ఇన్‌చార్జ్‌ల పాలన సాగిస్తే ప్రజలకు సత్వర సేవలు అందక ఇబ్బంది పడాల్సిన పరిస్థితి వస్తుంది. ఈ విషయం అధికారులకు తెలిసినా మండల స్థాయిలో ఇన్‌చార్జ్‌ల పాలనకు తెరదించే దిశగా చర్యలు చేపట్టలేదనే విమర్శలు రెవెన్యూ వర్గాల నుంచే వస్తున్నాయి. గత నెలతో బదిలీల ప్రక్రియ ముగిసినా... దీర్ఘకాలికంగా ఇన్‌చార్జ్‌ల పాలన సాగుతున్న మండలాలకు తహసీల్దార్లను నియమించక పోవడం గమనార్హం. దీంతో ఆయా మండలాల్లో ఇన్‌చార్జ్‌ల పాలన తప్పనిసరి అయింది.

- 18 మండలాలకు తహసీల్దార్లను నియమించలేదు
- ఏడాదిగా చాలా మండలాల్లో ఇదే తీరు
- ఇన్‌చార్జ్ తహసీల్దార్లతోనే నెట్టుకొస్తున్న వైనం
- కలెక్టరేట్‌లోనూ తహసీల్దార్ల కొరత

సాక్షి, పుట్టపర్తి: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి టీడీపీ నాయకుల ఒత్తిళ్ల మధ్య పనిచేసేందుకు అధికారులు జంకుతున్నారు. ఫలితంగా జిల్లాలోని చాలా మండలాల్లో తహసీల్దార్ పోస్టులు ఖాళీగానే ఉన్నాయి. ఎఫ్ఏసీ బాధ్యతలతో డీటీలు విధులు నిర్వర్తిస్తున్నారు. రెగ్యులర్ అధికారులను నియమించడంలో ఉన్నతాధికారులు కూడా మీనమేషాలు లెక్కిస్తున్నట్లు తెలిసింది. రాష్ట్రంలోని మిగిలిన జిల్లాల్లో అడహక్ కమిటీ సిఫారసు మేరకు నియామకాలు జరిగాయి. అయితే శ్రీసత్యసాయి జిల్లాలో మాత్రం ఇందుకు విరుద్ధంగా కొనసాగుతోంది. ఫలితంగా సగానికి పైగా మండలాల్లో ఇన్‌చార్జ్‌లతోనే కాలం నెట్టుకొస్తున్నారు. జిల్లాలో మొత్తం 41 మంది తహసీల్దార్లకు గాను కేవలం 20 మంది మాత్రమే విధుల్లో ఉన్నారు. మండలాల వారీగా పరిశీలిస్తే.. కేవలం 14 మండలాల్లో మాత్రమే తహసీల్దార్లు ఉండగా మిగిలిన 18 మండలాల్లో ఇన్‌చార్జ్‌లే పెద్దదిక్కుగా వ్యవహరిస్తున్నారు.

నిత్యం బిజీ షెడ్యూల్..

తహసీల్దారు అంటే మండల స్థాయి మెజిస్ట్రేట్. ఇంతటి హోదాలో ఉన్న తహసీల్దార్లపై అధికార పార్టీ పెత్తనం మితిమీరిపోయింది. తమ అస్థిత్వాన్ని కోల్పోయేలా చేస్తున్న టీడీపీ నేతల తీరుతో విసుగు చెందిన పలువురు సమస్యాత్మక మండలాల్లో విధులు నిర్వర్తించేందుకు ఆసక్తి చూపడం లేదు. చట్టవిరుద్ధంగా టీడీపీకి నాయకులకు లబ్ధి చేకూర్చి ఆ తర్వాత సమస్యల్లో చిక్కుకోవడం ఇష్టంలేని చాలా మంది తహసీల్దార్లు మౌనంగానే ఉండిపోతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో జిల్లాలో సగానికి పైగా మండలాల్లో తహసీల్దార్ పోస్టులు ఖాళీగా ఉంటున్నాయి. ఆయా స్థానాలకు వచ్చేందుకు అధికారులు ఎవరూ ఆసక్తి చూపడం లేదు. దీంతో డిప్యూటీ తహసీల్దార్‌కు అదనపు బాధ్యతలు అప్పజెప్పారు. ఫలితంగా ఇద్దరు చేయాల్సిన పనిని ఒక్కరే పూర్తి చేయాల్సి రావడంతో డీటీల్లో మానసిక స్థైర్యం లోపిస్తోంది. బిజీ షెడ్యూల్‌లో నేపథ్యంలో మండల స్థాయిలో రెవెన్యూ సమస్యలు పరిష్కారం కావడం లేదు. దీంతో సమస్యల పరిష్కరించడం అంటూ ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అర్జీలు ఇచ్చే వారి సంఖ్య పెరుగుతోంది.

జిల్లాలోని మొత్తం మండలాలు	32
జిల్లాలో పనిచేయాల్సిన తహసీల్దార్ల సంఖ్య	41
ప్రస్తుతం పనిచేస్తున్న తహసీల్దార్ల సంఖ్య	20
ఇన్‌చార్జ్ తహసీల్దార్లు ఉన్న మండలాలు	18
కలెక్టరేట్‌లో తహసీల్దార్ల సంఖ్య	05
ప్రస్తుతం పనిచేస్తున్న వారి సంఖ్య	03
డీఏఓలో తహసీల్దార్ల సంఖ్య	04
ప్రస్తుతం పనిచేస్తున్న వారి సంఖ్య	03

జిల్లా కేంద్రంలోనూ అవస్థలే..

జిల్లా కేంద్రం పుట్టపర్తి మండల తహసీల్దార్ పోస్టు కూడా ఖాళీగా ఉంది. ప్రపంచ ఆధ్యాత్మిక కేంద్రం కావడంతో అను నిత్యం వీఐపీలు వస్తుంటారు. ఈ క్రమంలో ప్రొటోకాల్‌లో అధికారులు బిజీగా ఉండాల్సిన పరిస్థితి. ఇంతటి కీలకమైన పుట్టపర్తి మండలానికి రెగ్యులర్ తహసీల్దార్‌ను కాకుండా ఇన్‌చార్జ్‌తోనే ఉన్నతాధికారులు సరిపెట్టడం విమర్శలకు తావిస్తోంది. చివరకు కలెక్టరేట్‌లో ఐదుగురు తహసీల్దార్లకు గాను ముగ్గురు మాత్రమే ఉన్నారు. అడ్మినిస్ట్రేషన్ విభాగంలో నలుగురికి గానూ ముగ్గురు మాత్రమే ఉన్నారు.

న్యాయవాదుల విధుల బహిష్కరణ


నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

అనంతపురం: ఏపీ హైకోర్టు జడ్జి జస్టిస్ కె.శ్రీనివాస రెడ్డిపై సామాజిక మాధ్యమాల్లో జరుగుతున్న ట్రోలింగ్‌ను నిరసిస్తూ అనంతపురం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా కోర్టులో న్యాయవాదులు బుధవారం విధులు బహిష్కరించారు. ఈ సందర్భంగా అశోక స్థూపం వద్ద చేపట్టిన నిరసన కార్యక్రమానికి జిల్లా కోర్టు ప్రాంగణంలో ఉన్న అన్ని న్యాయస్థానాల్లో న్యాయవాదులు సంఘీభావం తెలిపారు. న్యాయవాదుల ఐక్యత వర్ధిల్లాలి అంటూ నినాదాలు చేశారు. బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వెంకట్రాముడు, ఉపాధ్యక్షుడు ధర్మసింగ్ నాయక్, ట్రెజరర్ వెంకట రఘుకుమార్, సంయుక్త కార్యదర్శి జుబేర్, మాజీ ఉపాధ్యక్షుడు, సీనియర్ న్యాయవాది బదా నారాయణరెడ్డి, శ్రీకాంత్, భరత్ భూషణ్ రెడ్డి, అవ్వా సురేష్ తదితరులు మాట్లాడుతూ.. ట్రోలింగ్‌తో న్యాయ వ్యవస్థపై దాడి చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం సైతం జిల్లా కోర్టులో న్యాయవాదులు విధులను బహిష్కరించనున్నట్లు తెలిపారు.

కోవూరు మాజీ ఎమ్మెల్యే ఇంటిపై దాడి హేయం

- వైఎస్సార్‌సీపీ హిందూపురం నియోజకవర్గ సమన్వయకర్త టీఎన్ దీపిక ధ్వజం



చిలమత్తూరు: శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా, కోవూరుమాజీ ఎమ్మెల్యే నల్లపురెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ఇంటిపై టీడీపీ గూండాలు చేసిన దాడిని హిందూపురం వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త టీఎన్ దీపిక ఖండించారు. దాడిని హేయమైన చర్యగా పేర్కొన్నారు. బుధవారం హిందూపురంలో ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వందలాది టీడీపీ గూండాలు మూకుమ్మడిగా ప్రసన్నకుమార్‌రెడ్డి ఇంట్లోకి చొరబడి విధ్వంసానికి పాల్పడడం వెనుక భారీ కుట్ర దాగి ఉందన్నారు. రాష్ట్ర చరిత్రలో ఇలాంటి దారుణాన్ని గతంలో ఎన్నడూ చూడలేదన్నారు. ప్రసన్నకుమార్‌రెడ్డిని హతమార్చేందుకే ఈ దాడి జరిగినట్లుగా కనిపిస్తోందన్నారు. తమ కంటి ముందే విధ్వంసం జరుగుతున్నా పోలీసులు ప్రేక్షక పాత్ర పోషించడం దారుణమన్నారు. దాడికి బాధ్యులైన వారిపై కేసు నమోదు చేసి, కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

వైఎస్ జగన్ పర్యటనలో పోలీసుల తీరు అమానుషం

చిత్తూరు జిల్లా బంగారుపాళ్యంలో వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ పర్యటనను అడ్డుకునేందుకు పోలీసులు టీడీపీ కార్యకర్తల్లా బరితెగించడం సిగ్గుచేటని టీఎన్ దీపిక మండిపడ్డారు. మామిడి రైతులను పరామర్శించి వారిలో ఆత్మస్థైర్యం నింపేందుకు వెళ్లిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటనపై పోలీసులు విధించిన ఆంక్షలు చూస్తుంటే సీఎం చంద్రబాబు భయపడ్డారనేది స్పష్టమవుతోందన్నారు. పోలీసులను ఉసిగొల్పి రైతులను భయభ్రాంతులకు గురి చేసేలా లాఠీచార్జి చేయడం దుర్మార్గమన్నారు. ఈ దుశ్చర్యను బట్టి చూస్తే ఇది రైతు వ్యతిరేక ప్రభుత్వమని అర్థం అవుతోందన్నారు. ఎన్ని అడ్డంకులు సృష్టించినా, కేసులు బనాయించినా, బెదిరింపులకు దిగినా రాష్ట్ర ప్రజలు వైఎస్ జగన్ వెంటే ఉంటారనే విషయం ఈ పర్యటనతో స్పష్టమైందన్నారు. ఇప్పటికైనా వైఎస్ జగన్‌పై ఉన్న ప్రజాభిమానాన్ని గుర్తించి తమ నిరంకుశ ధోరణికి స్వస్తి పలకాలని సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్‌కు హితవు పలికారు.

ఉపాధ్యాయుడి బలవన్మరణం

అనంతపురం సిటీ: ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఓ ఉపాధ్యాయుడు బలవన్మరణానికి పాల్పడ్డారు. రైల్వే పోలీసులు తెలిపిన మేరకు... తాడిపత్రి సమీపంలోని బొడాయిపల్లికి చెందిన కుమ్మెత అంకిరెడ్డి (45)కి భార్య లక్ష్మీదేవి, ఇద్దరు కుమారులు ఉన్నారు. పాక్షిక అంధత్వం కోటా కింద ఉపాధ్యాయ వృత్తిలోకి ప్రవేశించిన ఆయన మొన్నటి వరకూ బుక్కరాయసముద్రంలోని జెడ్పీహెచ్ఎస్‌లో తెలుగు పండిట్‌గా పనిచేశారు. గత నెల జరిగిన బదిలీల్లో భాగంగా అదే మండలం సిద్ధరాంపురం జెడ్పీహెచ్ఎస్‌కు బదిలీ అయ్యారు. అనంతపురంలోని విద్యుత్ నగర్ సర్కిల్ 3వ క్రాస్‌లో నివాసముంటూ రోజూ పాఠశాలకు విధులకు వెళ్లి వచ్చేవారు. మొదటి కుమారుడు జ్ఞానదీపరెడ్డి ఇంటర్ పూర్తి చేశాడు. రెండో కుమారుడు హైదరాబాద్‌లో ఇంటర్ చదువుతున్నాడు. ఆర్థిక ఇబ్బందులతో పిల్లలను చదివించలేని పరిస్థితులు ఏర్పడ్డాయి. దీంతో మానసిక క్షోభకు గురైన బుధవారం తెల్లవారుజామున ప్రసన్నాయపల్లి రైల్వేస్టేషన్ సమీపంలో రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న జీఆర్పీ ఎస్ఐ వెంకటేశ్వర్లు, సిబ్బంది అక్కడకు చేరుకుని పరిశీలించారు. తొలుత గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్యగా భావించి మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించారు. కాసేపటి తర్వాత కుటుంబసభ్యులు అక్కడకు చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి అంకిరెడ్డిగా నిర్ధారించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు రైల్వే పోలీసులు తెలిపారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పేర్కొన్నారు.

యువతి అనుమానాస్పద మృతి

అనంతపురం: నగరంలోని సవేరా ఆస్పత్రిలో పనిచేస్తున్న నర్సు దివ్య (22) బుధవారం అనుమానాస్పద స్థితిలో మృతిచెంది కనిపించారు. శ్రీసత్యసాయి జిల్లా ముదిగుబ్బ గ్రామానికి చెందిన వడ్డె దివ్య.. మూడేళ్లుగా సవేరా ఆస్పత్రిలో పనిచేస్తున్నారు. అదే ఆస్పత్రికి చెందిన హాస్టల్‌లోనే ఉంటున్నారు. ఆరోగ్యం బాగోలేదని మంగళవారం రాత్రి తోటి నర్సులకు తెలిపి ట్యాబ్లెట్లు వేసుకుని నిద్రించారు. బుధవారం మధ్యాహ్నమైనా ఆమె లేవలేదు. మధ్యాహ్నం షిఫ్ట్ నర్సులు వచ్చి పలుకరించినా స్పందన లేకపోవడంతో పల్స్ పరిశీలించారు. నాడి చిన్నగా కొట్టుకుంటుండడంతో వెంటనే సవేరా ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆమె మృతి చెందినట్లు నిర్ధారించారు. కాగా, దివ్య మృతిపై తల్లిదండ్రులు అనుమానాలు వ్యక్తం చేస్తూ నాల్గో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

ఓనర్ నిర్లక్ష్యంపై కేసు నమోదు


ఫిర్యాదు చేస్తున్న మృతుడి తల్లి రామాంజినమ్మ

కొత్తచెరువు: యువకుడి మృతికి కారణమైన ఐచర్ యజమానిపై కేసు నమోదు చేసినట్లు కొత్తచెరువు పోలీసులు తెలిపారు. వివరాలను బుధవారం వెల్లడించారు. అనంతపురంలోని రాణినగర్‌లో నివాసముంటున్న పచ్చిపాల రామాంజినమ్మ కుమారుడు పి. రాజశేఖర్ (34).. అదే నగరానికి చెందిన ఐచర్ యజమాని అశోక్ వద్ద డ్రైవర్‌గా పనిచేసేవాడు. పోతలకుంట గ్రామ సమీపంలో జరుగుతున్న హంద్రీనీవా కాలవ పనులకు అవసరమైన జనరేటర్‌ను తన ఐచర్ వాహనంలో అమర్చి అశోక్ ఆద్దెకు ఇచ్చాడు. వాహనంతో పాటు డ్రైవర్ రాజశేఖర్ ఉన్నాడు. జనరేటర్ నిర్వహణకు ప్రత్యేకంగా సాంకేతిక నిపుణుడిని ఏర్పాటు చేయాల్సి ఉండగా ఇందుకు విరుద్ధంగా రాజశేఖర్‌తోనే ఆ పనులూ చేయిస్తూ వచ్చాడు. గత నెల 22న సాయంత్రం 5 గంటలకు జనరేటర్‌లో నీళ్లు పోయాలని రాజశేఖర్‌ను అశోక్ పురమాయించాడు. ఆ సమయంలో ప్రమాదవశాత్తు కాలు జారి జనరేటర్ రింగ్‌కు తగలడంతో రాజశేఖర్ కుడికాలు బొటన వేలు తెగిపడింది. చికిత్స కోసం తొలుత అనంతపురానికి అనంతరం కర్నూలులోని ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో ఈ నెల 7న రాజశేఖర్ మృతి చెందాడు. ఘటనపై బుధవారం మృతుడి తల్లి రామాంజినమ్మ ఫిర్యాదు మేరకు ఐచర్ యజమాని అశోక్‌పై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

యువతి అదృశ్యం

పెద్దవడుగూరు: మండలంలోని క్రిష్టిపాడు గ్రామానికి చెందిన 20 ఏళ్ల యువతి మంగళవారం నుంచి కనిపించడం లేదు. పామిడి మండలం గజరాంపల్లి గ్రామం వద్ద ఉన్న గ్రీన్ గార్మెంట్స్‌లో పనిచేస్తున్న ఆమె.. మంగళవారం ఉదయం విధులకు బస్సుల్లో వెళ్లింది. సాయంత్రం ఇంటికి చేరుకోకపోవడంతో తల్లితండ్రులు ఆరా తీశారు. ఆచూకీ లభ్యం కాకపోవడంతో బుధవారం ఉదయం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనపై మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఆంజనేయులు తెలిపారు.

జవాన్ల భూములకూ కరువైన రక్షణ


జవాన్ చెన్నారెడ్డి

- దేశ సరిహద్దులో విధుల్లో సైనికులు
- గ్రామాల్లో వారి భూముల కబ్జా
- కలెక్టరేట్‌ను ఆశ్రయిస్తున్న జవాన్లు
- భూములు రక్షించాలంటూ వేడుకోలు
- ఏడాదిలో జిల్లాలో మూడు ఘటనలు

సాక్షి, పుట్టపర్తి: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత స్థానికంగా లేని ఉద్యోగుల భూములకు రక్షణ లేకుండా పోయింది. దేశ సరిహద్దులో విధులు నిర్వర్తిస్తోన్న ఆర్మీ ఉద్యోగుల భూములు కాజేయడమే పనిగా కొందరు సిండికేటుగా మారి పాసు పుస్తకాలు తయారీ చేసుకుని.. ఆన్‌లైన్‌లో తొలగిస్తున్నారు. భూమి తమదేనంటూ రుబాబు చేస్తూ.. సాగులోకి ఎవరినీ రానివ్వడం లేదు. కుటుంబ సభ్యుల ద్వారా సమాచారం తెలుసుకున్న సైనికులు.. తమ భూమికి రక్షణ కావాలంటూ పోలీస్ స్టేషన్లు, రెవెన్యూ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నారు. రెండు నెలల వ్యవధిలో శ్రీసత్యసాయి జిల్లాలో మూడు ఘటనలు వెలుగు చూశాయి. తమ భూములు కొందరు కాజేశారంటూ కలెక్టరేట్ మెట్లెక్కారు. రెవెన్యూ అధికారులు స్పందించి తమ భూములను కాజేసిన వారి నుంచి ఇప్పించాలని, పొలంలోకి వెళ్లేందుకు పోలీసులు రక్షణ కల్పించాలని కోరుతున్నారు. దేశ ప్రజల రక్షణ కోసం సరిహద్దులో రాత్రింబవళ్లు విధుల్లో ఉంటున్న తమకు స్వగ్రామాల్లో విలువ లేకుండా పోతోందని ఆవేదన చెందుతున్నారు.

ఇంకా విచారణలోనే..

పెనుకొండ నియోజకవర్గం గోరంట్ల మండలం పాలసముద్రం పంచాయతీ రాగిమేకలపల్లికి చెందిన జవాన్ చౌడేశ్.. సర్వే నంబరు 72లో 4.92 ఎకరాల భూమిని కొందరు కాజేశారని గత మే 26న ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్ టీఎస్ చేతన్‌కు ఫిర్యాదు చేశారు. అదే గ్రామానికి చెందిన కొందరు కబ్జా చేశారని.. రెవెన్యూ అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడంతో కలెక్టరేట్‌కు వచ్చినట్లు వివరించారు. కాగా మరుసటి రోజే అదే గ్రామానికి చెందిన రైతు లక్ష్మీనారాయణ జవాన్ ఆరోపణలు అవాస్తవమని కలెక్టరేట్‌లో వివరణ ఇచ్చారు. బంధువుల మధ్య పంపకాల్లో తేడా ఉందని స్పష్టం చేశారు. అయితే ప్రస్తుతం విచారణ జరుగుతోందని అధికారులు తెలిపారు.

సెల్ఫీ వీడియో ద్వారా వినతి..

మడకశిర నియోజకవర్గం అమరాపురం మండలం ఉదుగూరుకు చెందిన నరసింహమూర్తి బీఎస్ఎఫ్‌లో జవానుగా సరిహద్దున విధులు నిర్వర్తిస్తున్నారు. అయితే అదే గ్రామానికి చెందిన కొందరు తనకు సంబంధించిన 2.09 ఎకరాలకు కాజేశారని సెల్ఫీ వీడియో ద్వారా సమస్యను వెలుగులోకి తెచ్చారు. భూమిని సాగు చేయడానికి తన కుటుంబ సభ్యులు వెళ్తే.. వేట కొడవళ్లతో కె.శివరం గ్రామానికి చెందిన నాగరాజు దాడికి యత్నిస్తున్నాడని విన్నవించారు. తన భూమిని అప్పజెప్పడంతో పాటు కుటుంబ సభ్యులకు రక్షణ కల్పించాలని కోరారు. మరుసటి రోజే రెవెన్యూ అధికారులు గ్రామానికి వెళ్లి సర్వే నంబరు 366–7,8,9లో ఉన్న 2.09 ఎకరాలను కబ్జాదారుల నుంచి వెనక్కి ఇప్పించారు.

ఎన్నిసార్లు విన్నవించినా..

ధర్మవరం మండలం బడన్నపల్లికి చెందిన చెన్నారెడ్డి అనే సీఆర్‌పీఎఫ్ జవాన్.. కనగానపల్లి మండలం దాదులూరు వద్ద తనకు సంబంధించిన 5.12 ఎకరాల పొలాన్ని కుర్లపల్లికి చెందిన కొందరు కబ్జా చేశారని సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్ టీఎస్ చేతన్‌కు ఫిర్యాదు చేశారు. పట్టా భూమి అని, కొన్ని దశాబ్దాలుగా సాగులో ఉన్నామని, అయితే ఇటీవల కొందరు కబ్జా చేశారని పేర్కొన్నారు. కోర్టు ద్వారా ఇంజెక్షన్ అనుమతులు తన పేరిట తెచ్చుకున్నట్లు వివరించారు. కనగానపల్లి పోలీసులకు చెప్పినా పట్టించుకోలేదని వాపోయారు. తన భూమిని కాపాడాలని కలెక్టరేట్‌ను ఆశ్రయించినట్లు చెప్పారు.

'మేడా'లో అడ్మిషన్.. జీజీహెచ్‌లో డెత్

- వివాదాస్పదంగా మారిన జీజీహెచ్ ఆర్థో వార్డులో యువకుడి మృతి
- వైద్యుల నిర్లక్ష్యమే కారణమంటూ 6 గంటలకుపైగా కుటుంబీకుల ఆందోళన
- దరిదాపులకు రాని సూపరింటెండెంట్ డాక్టర్ ఆత్మారాం



వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే బిడ్డ మృతి చెందాడంటున్న లక్ష్మీదేవి

అనంతపురం మెడికల్: ప్రభుత్వ సర్వజనాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఆత్మారాం సొంతంగా నిర్వహిస్తున్న మేడా నర్సింగ్ హోం నుంచి జీజీహెచ్‌కు రెఫర్ అయిన యువకుడు ఆర్థో వార్డులో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే తమ బిడ్డను కోల్పోవాల్సి వచ్చిందంటూ మృతుడి కుటుంబీకులు దాదాపు ఆరు గంటలకు పైగా ఆస్పత్రిలో ఆందోళన చేపట్టారు. వివరాలు..


మృతదేహం వద్ద బంధువులు, స్నేహితులు

ఉరవకొండ మండలం నింబగల్లు గ్రామానికి చెందిన వెంకటేష్, లక్ష్మీదేవి దంపతులకు ఓ కుమార్తె, ఇద్దరు కుమారులు ఉన్నారు. డిగ్రీ వరకు చదువుకున్న రెండో కుమారుడు రాజేష్ (22) బెంగళూరులో ఓ ప్రైవేట్ కంపెనీలో పనిచేస్తూ కుటుంబానికి చేదోడుగా నిలిచాడు. ఈ క్రమంలో తన ఎడమ కాలు నొప్పిగా ఉందంటూ 15 రోజుల క్రితం స్వగ్రామానికి వచ్చాడు. ఈ నెల 3న మేడా నర్సింగ్ హోంకు వెళ్లి డాక్టర్ ఆత్మారాంను సంప్రదించారు. ఆ రోజు అడ్మిషన్‌లో ఉంచుకున్న అనంతరం ఇక్కడైతే డబ్బు ఎక్కువ ఖర్చు అవుతుందని, జీజీహెచ్‌కు వెళితే అక్కడ ఉచితంగా వైద్యం చేస్తారని డాక్టర్ ఆత్మారాం తెలిపి, సిఫారసు చేయడంతో 4న ఆగమేఘాలపై జీజీహెచ్‌లోని ఆర్థో విభాగంలో వైద్యులు అడ్మిట్ చేసుకున్నారు. ఎంఆర్ఐ స్కాన్ తీయించిన అనంతరం ఎడమ కాలులో చీము ఉన్నట్లు నిర్ధారించి, ఈ నెల 7న శస్త్రచికిత్స చేశారు. అనంతరం వైద్యులు కానీ, సిబ్బంది కాని పట్టించుకోకపోవడంతో రెండు రోజుల పాటు నొప్పి తాళలేక రాజేష్ విలవిల్లాడినట్లు తల్లి లక్ష్మీదేవి కన్నీటి పర్యంతమయ్యారు. నొప్పి వచ్చినప్పుడల్లా పీజీ వైద్యులు పరీక్షించి ఓ టాబ్లెట్, ఇంజెక్షన్ ఇచ్చి పడుకోబెట్టేవారని వివరించారు. బుధవారం ఉదయం టిఫిన్ తింటున్న సమయంలో రాజేష్ ఒక్కసారిగా కుప్పకూలాడు. విషయాన్ని వెంటనే డాక్టర్లకు తెలపడంతో వారు పరీక్షించి మృతిచెందినట్లు నిర్ధారించారని వాపోయారు. విషయం తెలుసుకున్న బంధువులు, కుల సంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో ఆస్పత్రికి చేరుకుని ఘటనపై ఆరా తీశారు. వైద్యుల నిర్లక్ష్యంతోనే రాజేష్ మృతి చెందాడంటూ ధర్నా చేపట్టారు. విషయం తెలుసుకున్న అనంతపురం రెండో పట్టణ పోలీసులు అక్కడకు చేరుకుని సర్ది చెప్పడంతో ఆందోళనను విరమించారు. మధ్యాహ్నం 2 గంటలకు మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. సాయంత్రం పోస్టుమార్టం చేసి మృతుడి కుటుంబీకులకు అప్పగించారు. బాధిత కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

డబ్బు ఖర్చు పెట్టలేరనే జీజీహెచ్‌కు వెళ్లమన్నా



కాలు నొప్పితో రాజేష్ మేడా నర్సింగ్ హోంకు వచ్చాడు. ఒక రోజు ట్రీట్‌మెంట్ ఇచ్చా. మూడు సార్లు ఆపరేషన్ చేయాల్సి ఉందని, అందుకు బోలెడంత డబ్బు ఖర్చు అవుతుందని చెప్పా. వారికి ఆర్థిక స్థోమత లేక పోవడంతో నేనే జీజీహెచ్‌కు రెఫర్ చేసి, ఉచితంగా ఎంఆర్ఐ తీయించి, సర్జరీ చేశా. మృతికి సెప్టిసేమియా కారణమై ఉండవచ్చు.

– డాక్టర్ ఆత్మారాం, మెడికల్ సూపరింటెండెంట్, జీజీహెచ్